క్లుప్తంగా

రూ.30లక్షలతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మునగపాక మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో భవనం అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు కేటాయించామన్నారు. భవనంలో సీలింగ్, గచ్చులు, విద్యుత్ సదుపాయం, పెయింటింగ్ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. అవినీతికి తావులేకుండా భవన అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు. కొంతమంది అభివృద్ధి పనులపై కావాలని తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సూచనలు, సలహాల మేరకు మండల పరిషత్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

మామిడివాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


మామిడివాడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ బాల, వైద్య సిబ్బంది

రాంబిల్లి : ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని దిమిలి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాల అన్నారు. మామిడివాడ గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 21 మంది బీపీ, ఏడుగురు మధుమేహం, 9 మంది బీపీ, మధుమేహం రోగులకు పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ఎస్.వి.ఎన్ రాజు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల్ని ఆదుకోవాలి


అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు శ్రీ భద్రావతి వీవర్స్ కోఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీభద్రావతి చేనేత వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మాడెం నూకరత్నం, మాడెం సూరిబాబు, కొప్పల రామ్‌కుమార్, పప్పు, వెంకటేశ్వర్లు, మాడెం ఈశ్వరరావు, పచ్చారపు గోవింద, తేడ్లపు సతీష్, శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని పెంచాలి


విద్యార్థుల పుస్తకాలు తనిఖీ చేస్తున్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అప్పారావు

మునగపాక : విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని మరింత పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తిమ్మరాజుపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గాలి అప్పారావు కోరారు. పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు తనిఖీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఉపాధ్యాయులు సృజనను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న బాత్‌రూమ్‌లను పరిశీలించారు. క్లస్టర్ మొబైల్ రిజర్వుడ్ టీచర్ కర్రి లక్ష్మీనారాయణ ఆయన వెంట పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

కశింకోట: ఏఎస్ పేటలో మరిడిమాంబ అమ్మవారి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మొక్కజొన్న...లాభాలు మిన్న

- మండలంలో 150 ఎకరాల్లో..
- ఏడాది పొడవునా సాగు
- దిగుబడులు బాగు

మండలంలో సుమారు 150 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.10వేలు పెట్టుబడి అవుతుంది... మూడు నెలల్లో దిగుబడి వస్తుంది. సరైన యాజమాన్యం పాటిస్తే పెట్టుబడి పోను సుమారు రూ.30 వేలు వరకు లాభం వస్తుంది. దీంతో వాణిజ్య పంటగా రైతులను ఆకర్షిస్తోంది.


మొక్కజొన్న పంట

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అడుగడుగునా అండగా ఉంటోంది. పెట్టుబడి సాయం అందిస్తూ కొండంత భరోసానిస్తోంది. వాతావరణం కూడా రైతుకు సహకరిస్తోంది. దాంతో రైతు ఆలోచనలలో మార్పు వచ్చింది. కొత్తగా ఆలోచిస్తూ ఏడాది పొడవునా సాగు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. విభిన్న పంటల సాగుతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మండలంలో ఖరీఫ్ సీజనులో అత్యధికంగా వరి సాగు చేస్తుండగా కొన్ని ప్రాంతాలలో ఏడాది పొడవునా మొక్కజొన్నను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇది వాణిజ్య పంటగా రైతులను ఆకర్షిస్తోంది. పశువులకు కూడా దాణాగా, మేతగా పనికొస్తోంది. చాలా పరిశ్రమల్లో ముడి సరుకుగాను, తినుబండారాలు పేలాలు, తీపికండె, కాయగూరల రకంగాను వినియోగిస్తున్నారు. వాడకం బాగా పెరగడంతో సాగు కూడా పెరుగుతోంది. దీంతో మొక్కజొన్న సాగుకు వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు అందిస్తున్నారు...

విత్తు నాటే ముందు...

విత్తే ముందు భూమిని మూడు, నాలుగుసార్లు దుక్కు దున్నాలి. ఆఖరి దుక్కులో ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల గెత్తాన్ని వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి. బోదెకు పైనుండి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనపుడు నీరు బయటకు పోయేందుకు వీలుకలుగుతుంది. మొలకెత్తిన పది రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకివేయాలి.

లేత దశలో తెగుళ్ల నివారణ

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం..

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని, మరోసారి 30–35 రోజుల సమయంలో మూడోవంతు నత్రజని, 50–55 రోజుల మధ్య మరోసారి మూడోవంతు నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్ ఎరువును వేయాలి. మిగతా సగం పొటాష్‌ను పూత దశలో వేసుకోవాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని, 25–30 రోజుల సమయంలో మరోసారి నాలుగోవంతు నత్రజని, 45–50 రోజుల మధ్య నాలుగో వంతు నత్రజని, చివరగా 60–65 రోజుల మధ్యకాలంలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటల కొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజులలోపు అట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాటి, గడ్డి జాతి కలుపు మొక్కలను దాదాపు ఒక నెలపాటు అదుపుచేయవచ్చు. మొక్కజొన్నలను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటపుడు ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్‌ను కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారి చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాముల 2, 4డి సోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

అంతర కృషితో మంచి ఫలితాలు



విత్తిన 30–35 రోజులకు పశువులతో లేదా, ట్రాక్టరుతో అంతరకృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తరువాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదెలో నాగలిని నడిపితే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు దోహదపడుతుంది.

– బి.సరోజిని, మండల వ్యవసాయాధికారి

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం బాసట

పాయకరావుపేట : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల మహిళల్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెంటకోట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ పౌష్టికాహార కిట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అమ్మఒడి, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, పొదుపు సంఘాలకు సున్నావడ్డీ పథకం వంటి పథకాలు అందించారన్నారు.

గర్భిణుల ఆరోగ్యం కోసం 10 రకాల మంచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు మహిళల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లు వారి సంక్షేమం కోసం జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి తల్లి బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు అందించి పిల్లల్ని ఆరోగ్య వంతంగా పెంచుకోవాలన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సౌజన్య, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చిక్కాల రామారావు

అర్హులందరికీ నవరత్న పథకాలు

రాష్ట్రంలో అర్హులందరికీ నవరత్న పథకాలు అందడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల పెంటకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమం అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీ విషయమై ఆరా తీశారు. ఇంకా సంక్షేమ పథకాలు అందని వారుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇంటింటికీ తాగునీటి సరఫరాకు మొదటి విడతలో రూ.33.5 లక్షలు, రెండో విడతలో రూ.101 లక్షలు వెచ్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబు, జిల్లా పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ పార్వతీ తాతారావు, సర్పంచ్ చేపల నాగమణి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, ఉపసర్పంచ్ చిక్కాల బాబు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, పలు గ్రామాల సర్పంచ్‌లు బాబ్జి, వంగలపూడి సరస్వతి రామారావు, మేడిశెట్టి రామగోవిందు, కోటేశ్వరరావు, నీలవేణి శ్రీనివాసరావు, దివాణం, లోవరెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీలు సతీష్‌రాజు, నరేష్, గూటూరు రామగోవిందు, ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ జయప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు తదితరులు

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించే విధంగా నిధులు విడుదల చేస్తున్నామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం గ్రామంలో జల్‌జీవన్ మిషన్‌లో రూ. 88.5 లక్షలతో పైపులైన్ ఏర్పాటుకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో అతి తక్కువ రోజుల్లో తాగునీటి సమస్య తీరనుందని, గోదావరి జలాలు గ్రామానికి వస్తాయని, గ్రామంలో సురక్షితమైన తాగునీరు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి పైపు లైనుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

దోమల మందు పిచికారీ

మునగపాక: సీజన్‌లో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక మెయిన్‌రోడ్డులో సోమవారం దోమల నివారణకు దోమలమందు పిచికారీ చేయించారు. డ్రైనేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్టు తొలగిస్తున్నామన్నారు.

యోగాలో ఎంజేపీ గురుకులం విద్యార్థి ప్రతిభ


ఆదిత్యరుత్విక్

నక్కపల్లి : ఈనెల 4, 5, 6 తేదీల్లో బీకెఎస్ అయ్యంగార్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలో ఉపమాక గ్రామానికి చెందిన దవరసింగి ఆదిత్య రుత్విక్ మూడోస్థానం సాధించాడు. 12 నుంచి 15 ఏళ్ల బాలుర విభాగంలో రుత్విక్ ఈ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో తృతీయస్థానం సాధించినట్టు సోమవారం ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీష్ చెప్పారు. రుత్విక్ నర్సీపట్నం ఎంజేపీ ఏపీబీసీ డబ్ల్యు రెసిడెన్షియల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గురుకులం ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయుల సూచనలతో యోగా సాధన చేస్తున్నానని, రానున్న రోజుల్లో జాతీయస్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించేందుకు మరింత కృషి చేస్తానని ఆదిత్య రుత్విక్ చెప్పాడు.

సరైన ధ్రువపత్రాలు లేకపోతే చలానా తప్పదు

పాయకరావుపేట : స్థానిక బస్టాండ్ వద్ద ఎస్‌ఐ జోగారావు ఆధ్వర్యంలో పోలీసులు ఎనిమిది ఆటో స్టాండ్‌ల ఆటో సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల నుండి మండల కేంద్రానికి వచ్చే వాహన దారులు కచ్చితంగా సంబంధిత ధ్రువ పత్రాలను కలిగి ఉండాలని, సరైన పత్రాలు లేని వారికి ఈ చలానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆటోలకు ముందు సీట్లలో పిల్లలను, ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. స్కూల్ బ్యాగ్‌లను ఆటోలకు ఇరువైపులా తగిలించకూడదని, అతి వేగంగా వెళ్లరాదని, వర్షాకాలంలో వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది కాబట్టి జాగ్రత్తగా వెళ్లాలని, వాహనాల ఫిట్నెస్ కండిషన్ చెక్ చేసుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాలలో తరలించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మహిళలు, పిల్లల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. డ్రైవర్ పూర్తి వివరాలు ఆటోలో ప్రయాణికులకు కనిపించేలా ఉంచాలని డ్రైవర్లకు సూచించారు.


పాయకరావుపేటలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలి


సిబ్బందితో సమావేశమైన డాక్టర్ వెంకటేష్

రాంబిల్లి : ఈ నెల 10 నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన దిమిలి పీహెచ్‌సీలో వైద్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యకరమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం అన్న నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ మాత్రల ప్రాధాన్యత, పంపిణీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ఎస్.వి.ఎన్ రాజు పాల్గొన్నారు.

పోషణ సరకులు సద్వినియోగం చేసుకోవాలి

అచ్యుతాపురం (అనకాపల్లి): వైఎస్సార్ సంపూర్ణ పోషణను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను అన్నారు. అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చోడపల్లి సచివాలయ కన్వీనర్ నాయుడుబాబు, డీపీఎస్ నాయుడు, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు, ఆశా కార్యకర్త సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, హారిక, శివలక్ష్మి, రామతులసి, అనూష పాల్గొన్నారు.


తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న నాయకులు

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

మునగపాక : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో మన్మథరావు పంచాయతీ కార్యదర్శులను కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని, ముఖ్యంగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఈవోఆర్డీ ఈశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం


కె.వెంకటాపురంలో విద్యార్థి తల్లికి నగదు అందజేస్తున్న పద్మశాలి సేవా సమితి ప్రతినిధులు

కోటవురట్ల : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో పద్మశాలి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు ఆర్థిక ఆసరా కల్పిస్తూ మగ్గానికి ఊపిరి పోశారన్నారు. పద్మశాల సేవా సమితి సేవలు అభినందనీయమని కొనియాడారు. చేనేత కార్మికులు సంఘటితంగా మెలిగి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సేవా సమితి ప్రతినిధి ఏసుబాబు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నతి సాధ్యమని, సంఘం పిల్లల చదువు కోసం శ్రమిస్తోందన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాయకరావుపేటకు చెందిన హైమా నేత్రాలయ వైద్యుడు పి.ఎస్.ఎన్.ప్రసాద్, ఉపాధ్యాయుడు చిటికెల వెంకటరమణ ఆర్థిక సహాయం అందించారన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, సేవా సమితి ప్రతినిధులు నానాజీ, శివాజీ, తాతారావు, రాంబాబు, సత్యనారాయణ, లోవ, అర్జునరావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ సరకులు


లబ్ధిదారులకు సరకులు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు


పాటిపల్లిలో మహిళలకు సంపూర్ణ పోషణ సరకులు అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

నక్కపల్లి : గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ఇంటికే సరకులు అందించడం గొప్ప విషయమని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. నక్కపల్లిలో లబ్ధిదారులకు సోమవారం సంపూర్ణ పోషణ సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాలకు వెళ్లి సరకులు తీసుకోవడానికి లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన జగనన్న ప్రభుత్వం ఈ పోషకాహార సరుకులను నేరుగా వారి ఇళ్ల వద్దకే అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం, వారి వేతనాలు పెంచడం, అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉపసర్పంచ్ వీసం రాజు, అంగన్‌వాడీ సిబ్బంది దుర్గారాణి పాల్గొన్నారు.

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి కోరారు. మండలంలోని పాటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు ఆమె వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను సోమవారం అందజేశారు. మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్లు సరిసా శ్రీనివాసరావు, భీశెట్టి ధనశ్రీను, వైఎస్సార్‌సీపీ నేత త్రిమూర్తులు పాల్గొన్నారు.


గర్భిణులకు పోషణ సరకులు అందజేస్తున్న బొలిశెట్టి గోవిందరావు

ప్రజల అవసరాలు ముందుగానే గుర్తించే సీఎం

ఎస్.రాయవరం: రాష్ట్రంలో పేద ప్రజలకు ఏ పథకం ప్రయోజనకరంగా ఉంటుందో పరిశీలించి ముందే ప్రవేశపెట్టే ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో టేక్ హోమ్ సరకులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రజల గుండెల్లో సీఎం నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ భూపతి అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి పెద అబ్బాయి, భీమరశెట్టి అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా చెరువుల అభివృద్ధికి చర్యలు

- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు
- వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన

యలమంచిలి : ఆహ్లాదకరమైన వాతావరణలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. కొమ్మాయి గుండం చెరువు వద్ద రూ.84 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. అధికారులను వాకింగ్ ట్రాక్ ప్లాన్ వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు అందించారు. ట్రాక్ నిర్మాణం అబ్బురపరిచే విధంగా ఉండాలని, ఉదయం సాయంత్రం వేళల్లో వృద్ధులు సేద తీరడానికి పాలరాతి కట్టడాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఆడుకోవడానికి చక్కటి ఆటవస్తువులు, యువకులు మెచ్చేలా ఆధునిక హంగులతో ఓపెన్ జిమ్, చక్కటి మొక్కలు ఏర్పాటు చేయాలని, చెరువులో నీటిని శుద్ధి చేసి వాటర్ రివర్స్ ఫాలియింగ్ చేయాలని, చెరువు రివిట్‌మెంట్ రాతి కట్టడంతో నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్యకు సూచించారు. ట్రాక్ వద్ద యలమంచిలి పట్టణంలో స్వాతంత్య్ర సమరయోధుల పేర్లు శిలాఫలకాలపై ఆవిష్కరించబడతాయని కమిషనర్ వీరయ్య ఎమ్మెల్యేకు వివరించారు. పట్టణంలో ఉన్న అన్ని చెరువులు అభివృద్ధి చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వాకింగ్ ట్రాక్ నిర్మాణపు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు